
www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 1ఏప్రిల్ 2023
5
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు





డిపిఆర్‌ఒకు ఆత్మీయ వీడ్కోలు



సన్మానిస్తున్న సహోద్యోగులు

ప్రజాశక్తి-నెల్లూరు: కృష్ణా జిల్లా, మచిలీపట్నంకు బదిలీపై వెళ్తున్న జిల్లా సమాచార, పౌర సంబంధాల అధికారి ముమ్మడి వెంకటేశ్వర ప్రసాద్ కు కార్యాలయ అధికారులు, సిబ్బంది ఘనంగా ఆత్మీయ వీడ్కోలు పలికారు. శుక్రవారం కలెక్టరేట్ ఆవరణంలోని జిల్లా సమాచార, పౌర సంబంధాల అధికారి కార్యాలయంలో జిల్లా డిపిఆర్ఓగా విధులు నిర్వర్తించి కృష్ణాజిల్లా మచిలీపట్నం కు బదిలీ అయిన వెంకటేశ్వర ప్రసాద్ ను కార్యాలయ సిబ్బంది ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు సిబ్బంది మాట్లాడుతూ విధి నిర్వహణలో ఎక్కడా రాజీ పడకుండా, ప్రభుత్వ నిబంధనలను ఖచ్చితంగా పాటించే అధికారిగా అందరి మన్ననలు పొందారన్నారు. కార్యక్రమంలో ఏఐఈ కిషోర్, రమేష్, రవీంద్ర, పిఆర్ఓ వినోద్ కుమార్, సుబ్బమ్మ, సువర్ణ, ఏపీఎస్ ఫరీద్, శివరాం ప్రసాద్, గురుప్రసాద్ పాల్గొన్నారు.

"అయ్యో"బి ఇదేనా..!

- ఎంపి కాఫీ తాగి వెళ్లారు
- ఎంఎల్‌సిలు భజన చేశారు
- ఒక్క ఎంఎల్ఎ ఐదు నిమిషాలున్నారు
- తూతూ మంత్రంగా ఐఎబి సమావేశం

ఇరిగేషన్ అడ్వయిజరీ బోర్డు (ఐఎబి) అంటే ఎంతో ప్రతిష్టాత్మకమైనది. జిల్లాలో రెండు పంటలకు నీరు ఇచ్చే విషయం చర్చించి, ప్రభుత్వానికి నీటి లెక్కలు పంపి కేటాయింపులు చేసుకోవాల్సి ఉంటుంది. రైతులు నా భూమికి నీరిస్తారా ..పంట పడేందు కుంటనా..అప్పులు తీరుతాయా.. అంటూ ఎంతో ఆందోళనతో, ఆసక్తిగా ఐఎబి సమావేశం వైపు చూస్తున్నారు. అలాంటి సమావేశం మన ప్రజాప్రతినిధులకు పట్టలేదు. మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సమయానికి వచ్చారు. ఎంపి వచ్చి కాఫీ తాగి వెళ్లిపోయారు.. ఇద్దరు ఎంఎల్‌సిలు వచ్చి వేదికపై ఉన్నవారికి భజన చేసి వెళ్లిపోయారు. ఒక్క కందుకూరు ఎంఎల్ఎ వచ్చి తన ప్రాంత సమస్య ఒక్కటి ప్రస్తావించి క్షణం కూడా ఆలస్యం లేకుండా వెళ్లిపోయారు.. మన కోసం మాట్లాడి, కష్టాలు, కన్నీళ్లు తీర్చుతారని భావించిన రైతులకు ఈ పరిణామాలు ఆవేదన కలిగించింది. ఇలాంటి ప్రజా ప్రతినిధులనా మేము ఎన్నుకుంది అంటూ ముక్కున వేలుసుకున్నారు....



మాట్లాడుతున్న మంత్రి కాకాణి

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

సోమశిల, కండలేరు పరిధిలో ఖరీఫ్ పంటకు నీటి విడుదల విషయమై శుక్రవారం స్థానిక జెడ్‌పి సమావేశ మందిరంలో ఇరిగేషన్ అడ్వయిజరీ బోర్డు (ఐఎబి) సమావేశం నిర్వహించారు. ఉదయం 10.30 గంటలకు ఈ సమావేశం నిర్వహించాల్సి ఉంది. మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, కలెక్టర్ చక్రధర్‌బాబు, ముందుగా వచ్చి కూర్చున్నారు. పెన్నా డెల్టా, కనుపూరు, కావలి, ఉత్తర, దక్షిణ కాలువల కింద 5,51,000 ఎకరాలకు సాగునీరు అందాల్సి ఉండగా, ఇరిగేషన్ అధికారులు 2,85,000 ఎకరాల నీరు ఇవ్వాలని 32 టిఎంసిలు నీరు కేటాయింపులకు ప్రతిపాదనలు చేశారు. కండలేరు జలాశయం పరిధిలో 1,40,000 ఎకరాలకు 14 టిఎంసిలు కేటాయింపులకు ప్రతిపాదనలు చేశారు. ఇంతటి ప్రత్యేకమైన సమావేశా నికి డెల్టా, నాన్‌డెల్టా ఎంపి, ఎంఎల్‌సి, ఎంఎల్‌ఎలు హాజరై ఏయే కాలువల కింద ఎన్ని ఎకరాలకు నీరు ఇవ్వాలనే విషయంపై చర్చించాల్సి ఉంటుంది. అందరు ప్రజా ప్రతినిధులు వస్తారని ఆసక్తిగా చూశారు. ఎంఎల్‌సిలు వాకాటి నారాయణరెడ్డి, బల్లి కళ్యాణ్ చక్రవర్తి, కందుకూరు ఎంఎల్ఎ మహీధర్‌రెడ్డి రాళ్లపాడు ప్రాజెక్టుకు నీటి కేటాయింపులు రెండు నిమిషాలు మాట్లాడారు. వెంటనే బయలు దేరి వెళ్లిపోయారు. ఎంఎల్‌సి వాకాటి నారాయణరెడ్డి ఉపన్యసించారు. వేదిక పైన, కింద ఉన్నవారికి కృతజ్ఞతలు తెలిపారు. తాను సమావేశానికి ఆలస్యంగా వచ్చానని, మంత్రి, కలెక్టర్ సరైన సమయానికి ప్రారంభించారని అభినందించారు. గూడూరు ప్రాంతానికి సంబంధించి నీటి విడుదల విషయం మాట్లాడారు. తానేందుకు మాట్లాడకూడదన్నట్లు బల్లి కళ్యాణ్‌చక్రవర్తి కెమెరాలను చూసి, పిఏ వద్ద చేతిరుమాలు తెప్పించుకొని తుడుచుకొని పది నిమిషాలు ఏదోదో మాట్లాడి కూర్చున్నారు.

అప్పుడు వచ్చిన నెల్లూరు ఎంపి ఆదాల ప్రభాకర్‌రెడ్డి వచ్చారు. రైతుల సమస్యలు మాట్లాడుతారని, నీటి లెక్కలు పెంచుతారని అందరూ ఆశగా ఎదురుచూశారు. సిబ్బంది ఇచ్చిన కాఫీ తాగి ఒక్క మాట మాట్లాడకుండా వెళ్లిపోయారు. వచ్చిన నేతలు మాట్లాడింది ఏమీ లేకపోగ, ఆత్మకూరు, నెల్లూరు రూరల్, నెల్లూరు, కావలి, ఉదయగిరి,వెంకటగిరి, కోవూరు, గూడూరు, సూళ్లూరుపేట ఎంఎల్ఏలు మేకపాటి విక్రమ్‌రెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, పి. అనిల్‌కుమార్ యాదవ్, మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, ఆనం రామనారాయణరెడ్డి, నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, వర ప్రసాద్, కలివేటి సంజీవయ్య హాజరుకాలేదు. ఇంతటి ప్రాధాన్యత ఉన్న ఐఎబి సమావేశం తూతూ మంత్రంగా సాగింది. టీ, బిస్కెట్, ఖర్చులు మాత్రమే మిగిలాయి. మంత్రి కాకాణి, కలెక్టర్ చక్రధర్‌బాబులో ఐఎబి నిర్ణయాలు ప్రకటించారు. ఇలాంటి



మాట్లాడుకుంటున్న ఎంపి, ఎంఎల్‌సిలు

ప్రజా ప్రతినిధులునా మనం వెన్నుకుంది. కొందరు మీటింగ్ రారు.. వచ్చిన వారు రైతుల తరపున మాట్లాడారు. ఇది పరిస్థితి..

'రైతు' గొంతుకయ్యారు..!

ఓట్లు వేసి గెలిపించిన ప్రజా ప్రతినిధులు కాదు.. జిల్లా రైతు గొంతుకులు వారు. ఐఎబి సమావేశ సమయంలో జిల్లా స్థాయి వ్యవసాయ సలహామండలి సమావేశం నిర్వహించారు. మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి , కలెక్టర్‌లకు రైతు సంఘాల ప్రతినిధులు రైతుల గోడు వినిపించారు. రైతు సంఘాల నాయకులు చంద్ర రాజగోపాల్, పి. శ్రీరాములు, మూలి వెంగయ్య మాట్లాడుతూ కావలి కాలువ కింద లక్ష ఎకరాలుంటే, కేవలం 20 వేల ఎకరాలకే నీరు ఇస్తామన్నారని, ఈ విషయంలో ఆలోచించాలన్నారు. అల్లూరు రామన్న చెరువు, ఎస్‌పేట, ఉత్తర కాలువ, ఆయకట్టు పెంచాలని కోరారు. నీరు తక్కువగా ఉన్నందున రోటేషన్ పద్ధతిన నీరు ఇవ్వాలన్నారు. రైతులు పండించిన పంటను ప్రభుత్వం కొనుగోలు చేయడానికి కేంద్రాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అన్ని ప్రాంతాల రైతులకు చివరి పంట వరకు నీరు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. రైతు నాయకులు గోవిందరెడ్డి, కోటిరెడ్డిలు రైతుల ఇబ్బందులను సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. ఇటీవల జరిగిన సివిల్ సప్లయ్ కుంభకోణం వివరాలు తెలపాలని డిమాండ్ చేశారు. రైతు నాయకుల ప్రతిపాదనలు ఓపిగ్గా విన్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పరిష్కరిస్తామని హామీఇచ్చారు. రైతు నేతలతో కూర్చొని మాట్లాడి ఎక్కడ అవసరం ఉంటే అక్కడ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని మంత్రి ఆదేశాలు జారీ చేశారు.

రొటేషన్ పద్ధతిన నీటిని కేటాయించాలి
-ఎపి రైతు సంఘం ఐఎబి సమావేశంలో వినతి

ప్రజాశక్తి-నెల్లూరు: పంట సాగుబడికి అదనపు నీటిని కేటాయించే సమయంలో ప్రాంతాల మధ్య వివాదాలకు తావు లేకుండా తక్కువ నీరు ఉన్న సమయంలో రొటేషన్ పద్ధతిన నీటిని కేటాయించాలని ఏపి రైతు సంఘం ఐఎబి సమావేశంలో జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసింది. శుక్రవారం నగరంలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఐఎబి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న ఇరిగేషన్ శాఖ నుంచి మీరు పంపిన నీటి పంపిణీ ప్రతిపాదనలో మెట్ట ప్రాంతాలైన కావలి, కనుపూరు, సోమశిల ఉత్తర దక్షిణ కాలువలకు డెల్టా ప్రాంతాలకు కేటాయించిన దామాషా మేరకు అదనపు నీరు కేటాయింపు చేయాలన్నారు. ముఖ్యంగా ప్రాంతాల మధ్య వివాదాలకు తావు లేకుండా తక్కువ నీరు ఉన్నప్పుడు రొటేషన్ పద్ధతిని అమలు చేసి అన్ని ప్రాంతాలకు సమాన కేటాయింపులకు అవకాశం కల్పించుటకు తగు చర్యలు తీసుకోవలసినదిగా ఏపి రైతు సంఘం జిల్లా కమిటీ ప్రతిపాదనలు చేసింది. ఈ సమావేశంలో పాల్గొన్న ఏపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి మూలే వెంగయ్య, జిల్లా అధ్యక్షులు పులిగండ్ల శ్రీరాములు, జిల్లా ఉపాధ్యక్షులు చంద్రరాజగోపాల్, పి.జనార్ధన్ పాల్గొన్నారు. నాయకులు మాట్లాడుతూ జాఫర్ సాహెబ్ కాలువ కింద రిపేర్ల పేరుతో గత మూడు సంవత్సరాలుగా రెండవ కారుకు నీరు అందించకుండా రిపేర్ల పేరుతో ఇవ్వడం లేదన్నారు. ఏప్రిల్ 15 నుండి మే 15 వరకు అవకాశం ఇచ్చి తర్వాత సాగునీటిని రెండవ కారుకు ఇవ్వవచ్చును, ఆగస్టు చివర వరకు అందజేయవచ్చని అభిప్రాయం వ్యక్తం చేశారు. రామన్న చెరువు కింద ఉన్న రైతులు అందరూ పేద మధ్యతరగతి రైతులు ఆ చెరువు కింద పూర్తి ఆయకట్టుకు రెండవ కారు సాగుకు నీరు అందజేయాలన్నారు. ఉత్తర కాలవ జీకే నాయుడు కాలువ 72 వేల ఎకరాల భూమిలో పంట సాగుబడిలో ఉందన్నారు.,కనుపూరు కాలువ ఈ కాలం కింద చిన్న చితక చెరువులు నిండుగా ఉన్నాయన్నారు. ఆయకట్టు అభివద్ధి చెంది 66000 ఎకరాలు ఉన్నాయని, 30 వేల ఎకరాలకు నీరు ఇస్తామని పేర్కొన్నారని, మరో 20 వేల ఎకరాలకు నీటిని చేపల చెరువులు లీజు గడువులు జూన్ చివరకు పూర్తి అవుతుందని తెలిపా రు.ఉదయగిరి ప్రాంతంలో పసుపు, మొక్కజొన్న ,సజ్జ మొదలగు పంటలకు ప్రభుత్వం ఆర్.బి.కె ద్వారా. కొనుగోలు చేయించాలని కోరుతూ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

4.25 లక్షల ఎకరాలకు 46 టిఎంసిలు

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

సోమశిల, కండలేరు ప్రాజెక్టు పరిధిలో ఖరీఫ్ రెండో పంటకు 4.25 లక్షల ఎకరాలకు 46 టిఎంసిలు కేటాయించాలని ఇరిగేషన్ అడ్వయిజరీ బోర్డు (ఐఎబి) సమావేశం నిర్ణయించింది. మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఈ మేరకు ప్రకటించారు. ఇరిగేషన్ అధికారులు ప్రతిపాదనలు చేసిన అజెండాపై ఎలాంటి చర్చలు జరగకుండా తీర్మానం చేశారు. సోమశిల పరిధిలో 2.85 లక్షల ఎకరాలు, కండలేరు పరిధిలో 1.40 లక్షల ఎకరాలకు నీరు ఇవ్వాలని నిర్ణయించారు. రైతులకు అవసరమైన చోట కొనుగోలు కేంద్రాలు ఏర్పాట్లు చేయాలని మంత్రి ఆదేశించారు..



మంత్రి కాకాణితో మాట్లాడుతున్న కలెక్టర్

ఇరిగేషన్ అడ్వయిజరీ బోర్డు (ఐఎబి) సమావేశం వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఇరిగేషన్ అధికారులు ప్రస్తుతం సోమశిల ప్రాజెక్టులో 55.013 టిఎంసిలు నీటి నిల్వలున్నాయని, అందులో కేటాయింపులకు పోను, మిగిలిన 32 టిఎంసిలను సోమశిల పరిధిలోని కాలువకు విడుదల చేయాలని ప్రతిపాదించారు. పెన్నా డెల్టా కింద 2,47,000 ఎకరాలకు గాను 1,80,000 ఎకరాలకు 20.230 టిఎంసిలు, కనుపూరు కాలువ కింద 66,000 ఎకరాలకు గాను 30 వేల ఎకరాలకు 3.370 టిఎంసిలు, కావలి కాలువ కింద 1,24,000 ఎకరాలకు గాను, 30 వేల ఎకరాలకు 3.370 టిఎంసిలు, ఉత్తర కాలువ కింద 72,000 ఎకరాలకు గాను, 25వేల ఎకరాలకు 2.810 టిఎంసిలు, దక్షణ కాలువ కింద 42 వేల ఎకరాలకు గాను, 20 వేల ఎకరాలకు 2.250 టిఎంసిలు మొత్తంగా 5,51,000 ఎకరాలకు 2,85,000 ఎకరాలకు 32 టిఎంసిలు నీటిని కేటాయించాలని ప్రతిపాదనలు చేశారు. కండలేరు జలాశయం పరిధిలో 41.949 టిఎంసిలు నీటి నిల్వలుండగా అందులో 14 టిఎంసిలతో 1.14.000 ఎకరాలకు నీరు ఇవ్వాలని తెలుగుగంగ అధికారులు నివేదిక సిద్ధం చేశారు. ఈ ప్రతిపాదనలను ఏలాంటి చర్చ లేకుండా సమావేశం ఆమోదం తెలిపింది. ప్రజా ప్రతినిధులు ఎవరూ చర్చల్లో పాల్గొనకపోవడంతో మంత్రి ఈ ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపుతున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో జెడ్‌పి ఛైర్ పర్సన్ ఆనం అరుణమ్మ, కలెక్టర్ చక్రధర్‌బాబు, జాయింట్ కలెక్టర్ కూర్మానాద్, ఐఎబి ఛైర్మన్ నిరంజన్‌రెడ్డి, ఇరిగేషన్ ఎస్ఇ పి.కృష్ణమోహన్, తెలుగుగంగ ఇఇ కె. హరినారాయణరెడ్డి , ఎంపి ఆదాల ప్రబాకర్‌రెడ్డి, ఎంఎల్‌సి వాకాటి నారాయణరెడ్డి, కళ్యాణ్‌చక్రవర్తి, ఎంఎల్ఎ మహీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని పేదలకు పంచాలి

ప్రజాశక్తి-నెల్లూరు: అంబాపురం సర్వే నెం: 111 లోని ప్రభుత్వ భూమిని వెంటనే పేదలకు ఇళ్ల స్థలాలుగా అందజేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గసభ్యులు మాదా ల వెంకటేశ్వర్లు శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రూరల్ నియోజకవర్గం,అంబాపురం సర్వే నెం: 111/1, 111/2,111/3,111/4,111/5, 111/6 ల లోని ప్రభుత్వ భూమిలో గుడిసె లు వేసుకున్న దళితులను, వారి నాయకులను పోలీసులు , అధికారులు అరెస్ట్ చేయడం దారుణమన్నారు. ఈ ప్రాంతంలో నిరుపేదల గుడిసెలను తొలగించడాన్ని ఆయన ఖండించారు. ఇప్పటికే ఈ స్థలం ఎలాగైనా కబ్జా చేసేందుకు రియల్ ఎస్టేట్ వ్యాపారులు తమ ప్రయత్నాలు చేస్తున్నందన వెంటనే ప్రభుత్వం అర్హులైన నిరు పేద లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలుగా పంపిణీ చేయాలని జిల్లా కలెక్టర్ కు విజ్ఞప్తి చేశారు.

స్పా సెంటర్‌పై పోలీసుల రైడ్
-పలువురుని స్టేషన్‌కు తరలింపు

ప్రజాశక్తి-నెల్లూరు: స్థానిక దర్గామిట్ట ప్రాంతంలోని 'రోస్ కింగ్' స్పా సెంటర్‌పై దర్గామిట్ట పోలీసులు ఆకస్మిక దాడి నిర్వహించారు. శుక్రవారం నిర్వహించిన ఈ రైడ్‌లో చట్టవిరుద్ధమైన , అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న పలువురు యువతులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నగరంలో స్పా సెంటర్ల పేరుతో నిర్వాహకులు ఇతర రాష్ట్రాలకు చెందిన యువతులతో గుట్టుచప్పుడు కాకుండా చీకటి వ్యాపారం చేస్తున్నట్లు పోలీసులకు పక్కా సమాచారం రావడంతో పలు సెంటర్లపై ఆకస్మిక దాడి నిర్వహించారు. ఈ దాడుల్లో నగర డిఎస్‌పి శ్రీనివాసులరెడ్డి, ఐడి పార్టీకి చెందిన డిఎస్‌పి, నగరంలోని పలు పోలీసు స్టేషన్లకు చెందిన సిఐలు, ఎస్‌ఐలు , పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

దంపతుల ఆత్మహత్య

ప్రజాశక్తి-నెల్లూరు: నగరంలోని వెంగళరావునగర్ లో నివాసం ఉంటున్న దేవళ్ల కష్ణయ్య (55), దేవళ్ల సుజాత (50) అనే ఇద్దరు దంపతులు శుక్రవారం ఉదయం ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ దంపతులు జలదంకి మండలం, చామదల గ్రామానికి చెందిన వారు. మూడు నెలల క్రితం నగరానికి చేరుకొని వెంగళరావునగర్ ప్రాంతంలో అద్దె గహంలో నివాసం ఉంటున్నారు. దంపతులతోపాటు కుమార్తెఉంటుంది. అయితే ఉదయం కుమార్తె బయటకు వెళ్లి తిరిగి ఇంటికి చేరుకొనే సమయానికి ఈ ఘటన చోటు చేసుకుంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మతదేహాలను పోస్టుమార్టంకు తరలించారు. ఆత్మహత్యకు గల కారణాలను తెలుసుకునేందుకు దర్యాప్తు చేస్తున్నారు.

లౌకిక భారత్‌కోసం ఉద్యమిద్దాం

ప్రజాశక్తి-నెల్లూరు: భగత్ సింగ్ ,రాజు గురు, సుఖదేవుల స్ఫూర్తితో లౌకిక భారత్ కోసం ప్రతి ఒక్కరు ఉద్యమించాలని పిడిఎస్‌యు జిల్లా కమిటీ పిలుపు నిచ్చింది. భగత్ సింగ్ 92వ వర్ధంతి సందర్భంగా మర్చి 23 నుండి.31 తేదీ వరకు పిడిఎస్‌యుఆధ్వర్యంలో భగత్ సింగ్ వర్ధంతిసభలను జరపాలని ఇచ్చిన పిలుపులో భాగంగా శుక్రవారం నగరంలోని ఆల్ హుదా పాలిటెక్నిక్ కళాశాలలో భగత్‌సింగ్ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షులు ఎం సునీల్ మాట్లాడారు.

ఉన్నత చదువులే విద్యార్థుల లక్ష్యం

ప్రజాశక్తి-పొదలకూరు: పట్టణంలోని అమరావతి పాఠశాలలో యుకె.జి విద్యార్థులు 1వ తరగతిలోనికి, 5వ తరగతి విద్యార్థులు 6వ తరగతిలోనికి ప్రవేశిస్తున్న సందర్భంగా ఈ గ్రాడ్యుయేషన్ డే ను శుక్రవారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా కరెస్పాండెంట్ కె.సురేష్ మాట్లాడుతూ ప్రీప్రైమరీ నుండి ప్రైమరీ తరగతులకు, ప్రైమరీ తరగతుల నుండి ఉన్నత తరగతులకు, అనంతరం కళాశాల స్థాయికి ఎదగడం అనేది ఒక మధురానుభూతి అని, దానిని తమ జీవితంలో ఒక తీపి జ్ఞాపకంగా మిగిలిపోయేలా ఈ గ్రాడ్యుయేషన్ డేను తమ పాఠశాలలో నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు.గ్రాడ్యుయేషన్ డ్రెస్ టోపీతో తీసిన ఫొటో ఉన్న ప్రమోషన్ సర్టిఫికెట్‌ను, జ్ఞాపికను విద్యార్థులకి అందించారు.ఈ వేడుకలలో వారి పిల్లలను గ్రాడ్యుయేషన్ డ్రెస్, టోపీ తో చూసి, తమ పిల్లలు ఇంత త్వరగా ఎదిగిపోవడం చూసి ఆనందంతో పొంగి పోయారు.... ఇది గర్వించదగిన క్షణం అని తల్లిదండ్రులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



పాఠశాల తరలింపు

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు: మండలంలోని మండపం పంచాయతీ ఇసకదొరువు గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను సాలిపేట గ్రామంలోని పాఠశాలకు తరలించినట్లు మండల విద్యాశాఖ అధికారి సన్నపురెడ్డి వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. ఇసకదొరువు గ్రామంలోని పాఠశాల భవనం శిథిలావస్థస్థితికి చేరుకోవడంతో ముందస్తు జాగ్రత్తల కోసం ఉన్నతధికారుల సూచనల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. ఈ మేరకు శుక్రవారం నుంచి ఇసకదొరువు పాఠశాలలో ఒకటవ తరగతి నుంచి ఐదవ తరగతి వరకు చదువుతున్న 32 మంది విద్యార్థులకు సాలిపేట స్కూల్లో విద్యాబోధన జరుగుతుందని పేర్కొన్నారు.

ప్రమాణ స్వీకారనికి తరలిన తెలుగు తమ్ముళ్లు

ప్రజాశక్తి -కందుకూరు: నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జ్ ఇంటూరి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ ప్రమాణ స్వీకార వేడుకకు కందుకూరు నుంచి భారీ సంఖ్యలో తెలుగు తమ్ముళ్లు తరలివెళ్లారు. అంతకుముందు కంచర్ల శ్రీకాంత్‌ని, ఇంటూరి నాగేశ్వరరావుతో పాటు పట్టణ అధ్యక్షులు దామా మల్లేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షులు జనిగర్ల నాగరాజు, వేముల గోపాలరావు, మాదాల లక్ష్మీనరసింహం సహా పలువురు నేతలు, కార్యకర్తలు ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. తనపై నమ్మకం ఉంచి ఓట్లు వేసి గెలిపించిన పట్టభద్రులకు కంచర్ల శ్రీకాంత్ ధన్యవాదాలు తెలుపగా, ఇదే ఉత్సాహంతో రాబోయే ఎన్నికల్లో కందుకూరు గడ్డపై పసుపు జెండా ఎగురవేస్తామని ఇంటూరి నాగేశ్వరరావు ధీమా వ్యక్తం చేశారు. తర్వాత ఇంటూరి నాగేశ్వరరావు, కంచర్ల శ్రీకాంత్ జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. నియోజ కవర్గంలోని అన్ని గ్రామాల నుంచి నేతలు, కార్యకర్తలు, అభిమానులు, మహిళలు పెద్ద సంఖ్యలో వెలగపూడిలో జరగనున్న ప్రమాణ స్వీకారానికి 50కి పైగా వాహనాల్లో తరలి వెళ్లారు. పార్టీ రాష్ట్ర, పార్లమెంటు, నియోజకవర్గ, మండల కమిటీల సభ్యులు, పలువురు సీనియర్ నేతలు పాల్గొన్నారు.



జెండా ఊపుతున్న దృశ్యం

జిఒనెం.52ను రద్దు చేయాలి

ప్రజాశక్తి-కందుకూరు: బోయ, వాల్మీకి,బెంత, ఒరియాలను ఎస్టీ జాబితాలో చేరుస్తూ ఎపి ప్రభుత్వం తీసుకొచ్చిన జిఒనెం.52ను రద్దు చేయాలని కందుకూరు గిరిజన సంఘం జిల్లా నాయకులు చేవూరు దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ బొమ్మ వద్ద నిరసన శుక్రవారం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సామాజికవేత్త పాలేటి కోటేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కులాల మధ్య చిచ్చుపెట్టి ఎలక్షన్‌లో తన పబ్బం గడుపుకోవాలని చూస్తుందని అందుకు నిదర్శనమే ఈ జిఒనెం.52 అన్నారు. బాబాసాహెబ్ అంబేద్కర్ భవి ష్యత్తు తరాలను దష్టిలో ఉంచుకొని రాజ్యాంగంలో కల్పించినటు వంటి హక్కులను ప్రభుత్వాలు తమ స్వార్థాలకు విచ్ఛిన్నం చేస్తున్నాయని గ్రామాలకు దూరంగా నివసించే ఎస్టీ యానాదులకు ఈ జీవో వల్ల తీవ్ర నష్టం జరుగుతుందని ప్రభుత్వం వెంటనే దీనిని రద్దు చేయాలని కోరారు. అదేవిధంగా చేవూరు దుర్గాప్రసాద్ మాట్లాడుతూ ఎస్టీలలో చదువుకున్న ఉద్యోగాలు చేసే వాళ్లు చాలా తక్కువ అని మాకు ఉన్న రాయితీలను ఇతరులు ఎస్టీల్లో చేరడం వలన తమకు రాకుండా పోతాయని ప్రభుత్వం దీనిని దష్టిలో ఉంచుకొని వెంటనే జిఒనెం. 52 రద్దు చేయాలని లేని పక్షంలో కార్యక్రమాలను రూపొందిస్తామని తెలిపారు. అనంతరం అంబేద్కర్ బొమ్మ నుంచి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు నిరసన ర్యాలీ చేసి అనంతరం కార్యాలయం ఎఒకి వినతిపత్రం అందజేశారు.




నినాదాలు చేస్తున్న దృశ్యం

చంద్రబాబును కలిసిన మహిళా నాయకులు

ప్రజాశక్తి-కందుకూరు: నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి ఇంటూరి నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ ఆధ్వర్యంలో ఉండవల్లిలో తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడుని కందుకూరు నియోజ కవర్గం మహిళా నాయకులు కలిశారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపు కోసం బాగా కష్టపడ్డారంటూ చంద్రబాబు నాయుడు మహిళలను ప్రత్యేకంగా అభినందించారు.



మాట్లాడుతున్న మాజీ సిఎం చంద్రబాబు



సత్కరిస్తున్న దృశ్యం

'ఇంటూరి'కి సన్మానం

ప్రజాశక్తి-కందుకూరు: గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి కంచర్ల శ్రీకాంత్ ప్రమాణ స్వీకారోత్సవ సందర్భంగా కంచర్ల శ్రీకాంత్‌ని, ఇంటూరి నాగేశ్వరరావుని కలిసి శాలువతో కందుకూరు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి ముస్లిం మైనార్టీ సెల్ షేక్ రఫీ శుక్రవారం సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ముందు ముందు ఇంకా ఎన్నో ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షిస్తూ రాబోయే కందుకూరు అసెంబ్లీ ఎన్నికల్లో ఎంఎల్ఏగా ఇంటూరి నాగేశ్వరరావు గెలుపు కోసం ఇద్దరూ కలిసి క్యాడర్ను దిశ నిర్దేశం చేసి గత ఎంఎల్‌సి ఎన్నికల్లో ఏ విధంగా అయితే అందరూ కలిసి ఉత్సాహంగా పనిచేశారో అదే ఉత్సాహంతో పనిచేసి రాబోయే ఎన్నికల్లో గెలుపు సాధించాలని కోరారు.



ఎంపిని కలిసిన 'జాజుల'

ప్రజాశక్తి-కందుకూరు: వైసిపి బిసి సెల్ జిల్లా అధ్యక్షులు జాజుల కోటేశ్వరరావు శుక్రవారం పార్టీ అభివద్ధికి, జిల్లా బిసి సెల్ కార్యవర్గ నియామకాలకు సంబంధించి నెల్లూరు పార్లమెంట్ సభ్యులు, నెల్లూరు రూరల్ నియోజకవర్గం ఇన్‌ఛార్జి ఆదాల ప్రభాకర్ రెడ్డితో, నెల్లూరు నగర శాసనసభ్యులు పి అనిల్ కుమార్ యాదవ్‌ని కలిశారు.అనంతరం పార్టీ పురోభివద్ధికి, పార్టీ జిల్లా బిసి సెల్ కార్యవర్గ నిర్మాణానికి సంబంధించి వారి విలువైన సూచనలు సలహాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా జాజుల కోటేశ్వరరావు జగనన్న చేస్తున్న అభివద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి వైసిపి పురోభివృద్ధి తోడ్పాడాలని కోరారు.

నేడు అభినందన సభ

ప్రజాశక్తి-కందుకూరు: తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపొందిన డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ అభినందన సభ శనివారం ఉదయం 11 గంటలకు, కందుకూరు పట్టణంలోని శ్రీ వెంగమాంబ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించబడుతుందని కందుకూరు నియోజకవర్గ టీడీపీ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. కందుకూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జి ఇంటూరి నాగేశ్వరరావు, పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మాజీ శాసనసభ్యులు డాక్టర్ దివి శివరాం, ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు జిల్లాలోని పలువురు ముఖ్యనేతలు ఈ కార్యక్రమంలో పాల్గొంటారు. ఉదయం 10 గంటలకు కీర్తిశేషులు ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళులర్పించడం, అనంతరం అక్కడ నుంచి ఫంక్షన్ హాల్ వరకు ర్యాలీ జరుగుతుందని తెలిపారు.

'చలో ఢిల్లీ' కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని బైక్ ర్యాలీ



ప్రజాశక్తి-నెల్లూరు

కార్మికుల, కర్షకుల ఐక్యతతో ఈ నెల 5వ తేదిన నిర్వహించతలపెట్టిన 'చలో ఢిల్లీ ' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలంటూ సిఐటియు నగర కమిటీ ఆధ్వర్యంలో స్కూటర్ ర్యాలీ నిర్వహించారు. శుక్రవారం ఈ స్కూటర్ ర్యాలీ స్థానిక శెట్టిగుంట రోడ్డు సెంటర్ , పప్పులవీధి, ఆత్మకూరుబస్టాండ్, బోసుబొమ్మ సెంటర్, కనకమహల్ సెంటర్ (పుచ్చలపల్లి సుందరయ్య విగ్రహం సెంటర్), గాంధీబొమ్మ సెంటర్. విఆర్‌సి సెంటర్, అనితాహాల్ సెంటర్ మీదుగా చిన్నబజారు, ములుమూడిబస్టాండ్, సంతపేట మీదుగా ఏబిఎం కాంపౌండ్ వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు నగర కార్యదర్శి జి.నాగేశ్వరరావు మాట్లాడుతూ ఏప్రిల్ 5వ తేదిన కార్మికుల, కర్షకుల ఐక్యతతో నిర్వహిస్తున్న ఛలో డిల్లీ కార్యక్రమానికి యావత్తు భారతదేశంలోని కార్మిక వర్గం, రైతులు, వ్యవసాయ కార్మికులందరూ పాల్గొని విజయంతం చేయాలని పిలుపు నిచ్చారు. ప్రధానంగా ప్రధాని నరేంద్రమోడి అవలంభిస్తున్నటువంటి కార్మిక వ్యతిరేక విధానలకు వ్యతిరేకంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. నరేంద్రమోడి దేశ ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి కార్మికులు పోరాటం చేసి సాధించుకున్న చట్టాలన్నింటినీ ఒక్కసారిగా మార్చివేసి కేవలం 4 లేబర్ కోడ్లు సరిపోతాయని, కార్మికుల తమ సమస్యల సాధనకు పోరాటం చేసే ప్రధానమైె హక్కును తొలగించి వేయడం దారుణమన్నారు. రైతులు ఆరుగాలలు కష్టపడి పండించిన పంటకు కనీస మద్దతు ధర కల్పించాలని, మోటార్లకు మీటర్లు బిగించి రైతుల మెడలకు ఉరితాళ్లు వేయరాదని డిమాండ్ చేస్తూ నిర్వహిస్తున్న చలో డిల్లీ కార్యక్రమానికి అధిక సంఖ్యలో కార్మికులు, కర్షకులు పాల్గొని జయప్రధం చేయాలని పిలుపు నిచ్చారు. అనంతరం సిఐటియు నగర నాయకులు కత్తి శ్రీనివాసులు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన అనంతరం రైతుల ఆత్మహత్యలు భారీగా పెరిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. దేశ రాజధాని ఢిలీలో కార్మికులు, కర్షకులు తమ గళాన్ని వినిపించే ప్రయత్నం చలో డిల్లీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి దేశంలోని యావత్తు ప్రజానీకం మద్దతు ఇవ్వాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఆర్.శ్రీనివాసులు, పి.సూర్యనారాయణ, బి.రాంబాబు, పి.సుధాకర్, దామోదర్‌రెడ్డి, వివిద కార్మిక సంఘాల నాయకులు, కార్యకర్తలు, కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

హైస్కూల్లో సరస్వతి పూజ

ప్రజాశక్తి-పొదలకూరు: పట్టణంలోని బాలికల హైస్కూల్‌లో శుక్రవారం సరస్వతి దేవి పూజ ఘనంగా నిర్వహించారు. ఈ పూజకు విద్యార్థులు, ఉపాధ్యాయులు సంప్రదాయ దుస్తుల్లో హాజరయ్యారు. పాఠశాల ఆవరణమంతా రంగవల్లికలతో నింపారు. రంగురంగుల తోరణాలతో సరస్వతి దేవి పూజా మందిరాన్ని సిద్ధం చేశారు. వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య సరస్వతి దేవి పూజా కార్యక్రమం పూర్తి చేశారు. అనంతరం విద్యార్థులకు తీర్ధప్రసాదాలు అందజేశారు. పదోతరగతిలో తమ స్కూల్ విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులు సాధించాలని కోరుకున్నారు. అనంతరం పదోతరగతి విద్యార్థులకు ఫేర్ వెల్ డే శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో హైస్కూల్ ఇన్‌ఛార్జి హెచ్‌ఎం సునంద, పాఠశాల పేరెంట్స్ కమిటీ ఛైర్మన్ కండే సురేఖ, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

కోడూరులో 'గడప గడపకు మన ప్రభుత్వం'

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు :మండలంలోని కోడూరు గ్రామ పంచాయతీలో ఈ నెల 28వ తేదీన ప్రారంభమైన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శుక్రవారం కొనసాగింది. ఈ సందర్భంగా మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి ఇంటింటికి తిరిగి ప్రజలను కలుసుకున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మహిళలు హారతులిచ్చి మంత్రి గోవర్ధన్ రెడ్డికి ఘన స్వాగతం పలికారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నిండు నూరేళ్ళ చల్లగా ఉండాలి అని దీవించారు. సిఎం జగన్ అందిస్తున్న సంక్షేమ పథకాలు తమకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని లబ్ధిదారులు ఆనందం వ్యక్తంచేశారు. కార్యక్రమంలో వైసీపీ రాష్ట్ర కార్యదర్శి చిల్లకూరు సుధీర్ రెడ్డి, కన్వీనర్ ఉప్పల శంకరయ్య గౌడ్, ఎంపీపీ స్వర్ణలత, కావల్ రెడ్డి రంగారెడ్డి, కావల్ రెడ్డి హరిచంద్రా రెడ్డి, వివిధ శాఖల అధికారులు, వైసీపీ కార్యకర్తలు, నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

రూ.19.84 కోట్లతో బడ్జెట్ ఆమోదం

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : 2023-24 సంవత్సరం ఆత్మకూరు మున్సిపల్ బడ్జెట్ రూ.19.84 అంచనాతో శుక్రవారం మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో ఆమోదం పొందింది. మున్సిపల్ చైర్‌పర్సన్ గోపారం వెంకటరమణమ్మ, కమిషనర్ ఎం.రమేష్‌బాబు బడ్జెట్ ప్రవేశపెట్టారు. ప్రారంభ నిలువ రూ.5,58,44,141 ఉండగా సాధారణ ఆమలు మూలధనం రూ.14,25,69,823గా చూపారు. దాంతో మొత్తం ఆదాయం రూ.19,84,13,984గా సవరించిన అంచనాల ప్రకారం ప్రవేశపెట్టినట్లు మున్సిపల్ కమిషనర్ తెలిపారు. ఖర్చులు రూ.13,41,55,823గా చూపారు. ఆత్మకూరు మున్సిపల్ అభివృద్ధి కోసం ప్రభుత్వానికి రూపొందించినట్లు ఎంఎల్ఎ మేకపాటి విక్రమ్ రెడ్డి ఎక్స్‌అఫిషియో సభ్యులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి పనులు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి తవనంతం కృషి చేస్తున్నారు. అనంతరం కౌన్సిలర్లు నౌషాద్ బేగం, గౌస్ బాషా సమావేశంలో మాట్లాడుతూ అభివృద్ధి భవనాలలో నివసిస్తున్న ముస్లిముల కోసం మసీదును ఏర్పాటు చేయాలని వారు మున్సిపల్ చైర్ పర్సన్‌ను కోరారు. కౌన్సిలర్ శశికిర్ రెడ్డి మాట్లాడుతూ వెంకటరావుపల్లెలోని తిప్ప ఎర్రమట్టిని తరలిస్తున్నట్లు వాటిని కట్టడి చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

భోజన ప్యాకెట్లు అందజేత

ప్రజాశక్తి-కావలి : హెల్ప్ టు హెల్ప్ ట్రస్ట్ "కావలి వ్యవస్థాపక అధ్యక్షులు ఎస్.రమేష్ ఆధ్వర్యంలో వారి తల్లి ఎస్.కొండమ్మ మొదటి వర్ధంతి సందర్భంగా కర్నాటక రాష్ట్రం నుండి వలస కూలీలుగా కావలికి వచ్చి ముసునూరు గేట్ దగ్గర ఖాళీ స్థలంలో 30 కుటుంబాలు, చిన్నపాటి గుడారాలు వేసుకొని ఎన్నో సమస్యలతో, జీవనం కొనసాగిస్తున్న వారందరికీ శుక్రవారం "ఎగ్ బిర్యాని" పాకెట్లు అందజేశారు. ఈ సందర్భంగా గౌరవ అధ్యక్షులు షేక్ ఖాదర్ బాషా మాట్లాడుతూ హ్యాపీ సేవా సంస్థ అధ్యక్షులు ఘని బాషా, ప్రియదర్శిని మహిళా మండలి అధ్యక్షులు షేక్ ఖాదర్ బీ, బీబీ రత్నమ్మ, చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు ఎం.వి.ఎన్ ప్రసాదరావు, రహీం, చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు, అలీం తదితరులు పాల్గొన్నారు.

విట్స్ లైబ్రేరియన్‌కు అవార్డు

ప్రజాశక్తి-కావలి : విట్స్ కళాశాల లైబ్రేరియన్‌గా పని చేస్తున్న డాక్టర్ ఒ.శేషయ్యకు బెస్ట్ పేపర్ అవార్డు లభించింది. 24, 25 తేదీల్లో కర్నూలులో సిల్వర్ జూబిలీ గవర్నమెంట్ కాలేజీలో జాతీయ స్థాయి సెమినార్ నిర్వహించారు. ఈ సెమినార్‌లో కావలి విట్స్ కాలేజీ లైబ్రేరియన్ డాక్టర్ ఒ.శేషయ్య బెస్ట్ పేపర్ అవార్డు లభించింది. అప్లికేషన్ ఆఫ్ విజిటి టూ ట్రాన్స్‌ఫర్ లైబ్రరీ సర్వీసెస్ ఫ్రమ్ ట్రెడిషనల్ టూ డిజిటల్‌లో భాగంగా డిజిటల్స్ బెస్ట్ ప్రాక్టీసెస్ ఇన్ పి.బి.ఆర్.విట్స్ సెంట్రల్ లైబ్రరీ అనే పేపరును సమర్పించినందుకు ఆయనకు బెస్ట్ పేపర్ అవార్డు లభించింది. ఈ అవార్డు క్లస్టర్ యూనివర్సిటీ వైస్‌ఛాన్సలర్ డాక్టర్ సాయిగోపాల్ చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా కాలేజ్ మేనేజ్మెంట్, ప్రిన్సిపాల్, స్టాఫ్ అభినందించారు.

'గడపగడపకు మన ప్రభుత్వం'

ప్రజాశక్తి-విడవలూరు : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశానుసారం సంక్షేమ పథకాలు అందుకొన్న ప్రతి కుటుంబాన్ని ఆప్యాయంగా పలకరిస్తూ శుక్రవారం ఎంఎల్ఎ నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మన ప్రభుత్వం గడపగడపకు కార్యక్రమం 107వ రోజు ఊటుకూరు పంచాయతీలో నిర్వహించారు. కార్యక్రమంలో కోవూరు నియోజకవర్గ యువజన విభాగం కమిటీ అధ్యక్షులు నల్లపరెడ్డి రజత్ కుమార్ రెడ్డి, కొండూరు వెంకటసుబ్బారెడ్డి, బెజవాడ గోవర్ధన్ రెడ్డి, రామిరెడ్డి విజయ్ భాస్కరెడ్డి, నవీన్‌రెడ్డి, వైసిపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

శ్రీ చైతన్య కళాశాలలో సరస్వతి పూజ

ప్రజాశక్తి-అల్లూరు : మండలంలోని శ్రీ చైతన్య ఇంగ్లీష్ మీడియం కళాశాలలో శుక్రవారం ఘనంగా సరస్వతి పూజను నిర్వహించి ప్రత్యేక పూజలు చేపట్టారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ శివకుమార్ మాట్లాడుతూ త్వరలో జరుగనున్న 10వ తరగతి పరీక్షలకు సంబంధించి కళాశాల నుండి 85 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నట్లు వివరించారు. అందులో భాగంగా హాల్ టికెట్లను ప్రతి ఒక్కరికీ అందజేశామన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ ఖాజా రంతుల్లా తదితరులున్నారు.

2వ జీ తెలుగు డ్రామా ఆడిషన్స్

ప్రజాశక్తి-నెల్లూరు : జీ తెలుగు డ్రామా జూనియర్స్ ఆడిషన్స్ 2వ తేదీన సీజన్స్ ఇన్, పోలీస్ ఆఫీస్ రోడ్డులో ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు ఆడిషన్లు చేపడుతున్నట్లు నిర్వాహకులు తెలియజేశారు. ప్రతిభావంతులను ప్రోత్సహించేందుకు ఎప్పుడూ ముందుండే జీ తెలుగు ఇప్పుడు డ్రామా జూనియర్స్ సరికొత్త సీజన్‌తో మీ ముందుకు వచ్చేస్తోంది. తెలుగు రాష్ట్రాల్లోని పిల్లల్లోని నటనా ప్రతిభను వెలుగులోకి తెచ్చే లక్ష్యంతో డ్రామా జూనియర్స్ సీజన్ 6 ప్రారంభించేందుకు సన్నాహాలు ప్రారంభించింది. ఇప్పటికే విజయవంతంగా 5 సీజన్లను పూర్తి చేసుకున్న డ్రామా జూనియర్స్ మరో సీజన్ తెలుగు ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతోంది. అంతేకాదు ప్రతిభగల గాయనీ గాయకులను ఆడిషన్స్ ఆహ్వానిస్తోంది. డ్రామా జూనియర్స్ సీజన్ 6 కోసం తెలుగు రాష్ట్రాల్లో నటనపై ఆసక్తిగల చిన్నారులతో పాటు సంగీతంపై మక్కువ గల వారికి ఇదే చక్కని అవకాశం. 3 నుంచి 13 సంవత్సరాల వయస్సు గల పిల్లలకు ఇదే సువర్ణావకాశం. మీ పిల్లలకు నటనపై ఆసక్తి ఉంటే వెంటనే వారి ప్రతిభను ప్రోత్సహించి వారి భవిష్యత్తుకు బాటలు వేయండి. విజయవంతంగా కొనసాగుతున్న జీ తెలుగు డ్రామా జూనియర్స్‌తోపాటు సింగింగ్ షో కోసం ఇన్‌ఫ్రా గ్రౌండ్ ఆడిషన్స్ నిర్వహించనుంది. ఏవైనా సందేహాలు ఉంటే 9154984009 నెంబర్కు కాల్ చేయవచ్చని నిర్వాహకులు తెలియజేశారు.

అధికారులతో సమావేశం

ప్రజాశక్తి-కావలి : సార్డ్ స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో క్రిస్టియన్‌పేట 1వ లైనులో సంస్థ ఆడిటోరియంలో సమావేశం నిర్వహించగా ముఖ్యఅతిథులుగా అడిషనల్ శివప్రసాద్‌రెడ్డి, 2వపట్టణ ఇన్‌ఛార్జ్ సి.ఐ.మాల్యాద్రి, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ శివ, వైసిపి వార్డు ఇన్‌ఛార్జ్ సున్నాపురెడ్డి, సంస్థ సిఎఫ్ఒ భూషణ్‌బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమ్యూనిటీ రకరకాల సమస్యలను ఒకేసారి పరిష్కరించేందుకు అన్నిశాఖల అధికారులను ఈ సమావేశానికి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కమ్యూనిటీకి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఎయిడ్స్ నియంత్రణ శాఖ, ప్రాజెక్టుమేనేజర్ జె.బెనోమీ, సార్డ్ సిబ్బంది శివ, మానస, హేమలత, ప్రశాంతి, నీరజ, పద్మజ, తదితరులు పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - కావలి : స్థానిక పిబిఆర్ విట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో ప్రతి సంవత్సరం దేశవ్యాప్త ఇంజనీరింగ్ విద్యార్థుల సాంకేతిక ప్రతిభావంతులను వెలికితీసేందుకు ఒక వేదికను కల్పించేందుకు "విశ్వత్సవ్"పేరుతో జాతీయస్థాయి సాంస్కృతిక సమ్మేళనం నిర్వహిస్తారు. అందులో భాగంగా ఈ సంవత్సరం విశ్వత్సవ్ 2023"పేరుతో ఏప్రిల్ 15వ తేదీన నిర్వహించనున్న కార్యక్రమానికి సంబంధించిన గోడపత్రికను, వెబ్‌సైట్‌ను శుక్రవారం సదరు కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ దత్తాత్రేయశర్మ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. పాల్గొనదలచినవారు విద్యార్థులు ముందుగా తమ పేర్లను "విశ్వత్సవ్" వెబ్‌సైట్ ద్వారా నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సురేష్‌బాబు పాల్గొన్నారు.

'ఆసరా' చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి-అనంతసాగరం : మండలంలో పొదుపు మహిళలకు మూడో విడత వైఎస్ఆర్ ఆసరా చెక్కులను ఎంఎల్ఎ మేకపాటి విక్రమ్‌రెడ్డి శుక్రవారం పంపిణీ చేశారు. ఆయన తొలుత వైఎస్ఆర్ క్రాంతిపథం ద్వారా ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించి పలువురు లబ్ధిదారులతో మాట్లాడారు. అనంతరం స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, మహిళలతో కలిసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. దాతల సహకారంతో అనంతసాగరం బస్టాండ్ నిర్మాణాన్ని సైతం చేపట్టనున్నట్లు తెలిపారు. అనంతరం మండలంలో 3వ విడత వైఎస్ఆర్ ఆసరా మంజూరైన 516 స్వయం సహాయక సంఘాలకు రూ.4.76కోట్ల చెక్కును అందజేశారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, వైఎస్ఆర్ క్రాంతిపథం అధికారులున్నారు.

మాజీ మంత్రి సోమిరెడ్డి ఫ్లెక్సీ దగ్ధం



- కోడూరులో ఉద్రిక్త వాతావరణం - పోలీసులకు ఫిర్యాదు

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు : మాజీ మంత్రి, తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ఫ్లెక్సీ బ్యానర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు దగ్ధం చేశారు. ఈ ఘటనతో మండలంలో కోడూరు పంచాయతీ మహాలక్ష్మీపురం గ్రామంలో ఉద్రిక్త వాతావరణం చోటు చేసుకొంది. స్థానిక టిడిపి నాయకులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా... మాజీ మంత్రి చంద్రమోహన్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు వీరబోయిన గంగాధర్, మాజీ సర్పంచ్ ఊటుకూరు శ్రీనివాసులు, ఊటుకూరు అవినాష్, అబూబకర్, సీతారామయ్య, మునిరత్నం, వెన్నెలకంటి సుధాకర్, బత్తెల వెంకటరమణయ్య తదితరులు మహాలక్ష్మీపురం సెంటర్లో ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. గుర్తు తెలియని వ్యక్తులు అర్ధరాత్రి ఫ్లెక్సీని తగులబెట్టారు. ఫ్లెక్సీ దగ్ధం ఘటనపై సమగ్ర విచారణ చేసి, నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

ఆర్‌టిఐ కమిషనర్‌కు టిడిపి వినతి

ప్రజాశక్తి-పొదలకూరు : మండల అధికారులు సమాచార హక్కు చట్టానికి తూట్లు పొడుస్తున్నారని, వారు చేసిన అవినీతి, అక్రమాలు బయటపడతాయని అడిగిన సమాచారాన్ని అధికారులు ఇవ్వకుండా తప్పించుకుంటున్నారని టిడిపి మండల అధ్యక్షుడు తలచీరు మస్తాన్ బాబు, పట్టణ అధ్యక్షుడు బొద్దులూరు మల్లికార్జున నాయుడు ఎపి ఆర్‌టిఐ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. శుక్రవారం స్థానిక ఆర్‌అండ్‌బి గెస్ట్ హౌస్‌లో కమిషనర్‌ను కలిసి వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో పొదలకూరు మండల టిడిపి కార్యదర్శి కొండ వెంకటేశ్వర్లు, టిఎన్‌ఎస్‌ఎఫ్ తిరుపతి పార్లమెంట్ ఉపాధ్యక్షుడు కలగట్ల సన్నీ, మండల ప్రధాన కార్యదర్శి పల్లెపాఠ్ వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీ సాంబశివ ట్రస్ట్ సేవలు అభినందనీయం



మాట్లాడుతున్న ఎంఎల్ మేకపాటి విక్రమ్‌రెడ్డి

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

మెట్ట ప్రాంతమైన ఆత్మకూరు నియోజకవర్గ కేంద్రంలో ఉన్న జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో శ్రీసాంబశివ ట్రస్ట్ నిర్వాహకులు కంచి పరమేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులకు ప్రతిరోజు నిత్య అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమని ఎంఎల్ఎ మేకపాటి విక్రమ్‌రెడ్డి కొనియాడారు. స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో మొదటగా ఎంఎల్ఎ వివిధ రకాల వైద్య సేవలు అందించే వైద్యశాలలను ప్రారంభించారు. ఆయా విభాగాలలో జరుగుతున్న వైద్యాన్ని ప్రభుత్వ వైద్యశాల సూపరిండెంట్ శేషారత్నంను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైద్యశాల ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. మెట్ట ప్రాంతంలో ఎంతో ప్రాధాన్యత కలిగిన జిల్లా వైద్యశాల ఉండడం ఈ ప్రాంతం ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఈ ప్రాంతంలోని యువత సైతం పుట్టిన ఊరికి గ్రామానికి మంచి చేయాలన్న తలంపుతో ఉన్నారన్నారు. విశ్రాంత ఉపాధ్యాయులు శేషారెడ్డి మాట్లాడుతూ పరమేశ్వర్ రెడ్డి సేవాగుణం, సేవా కార్యక్రమాలు గురించి తెలియజేశారు. డిసిహెచ్ రమేష్ మాట్లాడుతూ అనేక వైద్యశాలల్లో అన్నదాన కార్యక్రమాలు ఉండడం సహజమని తెలిపారు. అయితే ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలలో రోగులు, హెల్పర్లుతోపాటు వైద్య సిబ్బందికి, డాక్టర్లకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేస్తామని చెప్పడం సంతోషించదగ్గ విషయమన్నారు. ప్రస్తుతం 100 పడకలు ఉన్న వైద్యశాలను మరో 50పడకల అదనపు వైద్యశాలగా మంజూరు చేయించాలని ప్రతిపాదనలు పంపి ఉన్నామని ఎంఎల్ఎ విక్రమ్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. వైద్యశాల సూపరిండెంట్ శేషారత్నం మాట్లాడుతూ తమ వైద్యశాలలో రోగులు, హెల్పర్లకు అన్నదాన కార్యక్రమం సంకల్పించడం సంతోషించదగ్గ విషయమన్నారు. రెడ్డి అండ్ రెడ్డి గ్రూప్ చైర్మన్ రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ తమ వియ్యంకుడు పరమేశ్వర్ రెడ్డి పరబ్రహ్మ స్వరూపమైన అన్నదాన కార్యక్రమాన్ని చేయాలని సంకల్పించడం సంతోషమన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ఎంఎల్ఎ మేకపాటి విక్రమ్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో డిఎంహెచ్ఒ పెంచలయ్య, ఎంపిపి కేత వేణుగోపాల్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వెంకట రమణమ్మ, మున్సిపల్ వైస్ చైర్మన్ సర్దార్ కమిషనర్ రమేష్ బాబు, వైసిపి పట్టణ కన్వీనర్ అల్లారెడ్డి ఆనంద రెడ్డి డాక్టర్ ఆది శేషయ్య, డాక్టర్ సత్యనారాయణ, వైసిపి నాయకులు వినయ్ కుమార్ రెడ్డి, కొండా వెంకటేశ్వర్లు, కౌన్సిలర్లు మహబూబ్ బాషా, రాజశేఖర్, పెంచలయ్య, వెంకటేశ్వర్లు, బిజెపి రాష్ట్ర నాయకులు కర్నాటి ఆంజనేయ రెడ్డి, బుజ్జిరెడ్డి, కుడుముల సుధాకర్ రెడ్డి, టిడిపి నాయకులు పులిమి శైలజా రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



ఆక్సిజన్‌ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ

జిల్లా వైద్యశాల అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

ఆత్మకూరు నియోజకవర్గానికే కాక సమీప నియోజకవర్గాల ప్రజలకు విశిష్ట సేవలు అందిస్తున్న ఆత్మకూరు జిల్లా ప్రభుత్వ వైద్యశాలను మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని ఎంఎల్ఎ మేకపాటి విక్రమ్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆత్మకూరు జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో నూతనంగా నిర్మించిన బాల భవిత కేంద్రం, 500 కె లిక్విడ్ ఆక్సిజన్ ప్లాంట్, ఎస్ఎన్‌సియు విభాగాలను జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారులు, వైద్యశాల అధికారులు, నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, వైసిపి నాయకులతో కలిసి ఎంఎల్ఎ లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 100 పడకల ఆసుపత్రిగా ఉన్న దీనిని 150 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేశారని, పెంచిన 50 పడకలకు సంబంధించి అవరమైన పరికరాలు, సిబ్బంది, భవన వసతి కోసం ఇప్పటికే ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి అందచేసి ఉన్నామని, అవి మంజూరై త్వరలోనే ఆసుపత్రికి రానున్నాయని వివరించారు. ఆసుపత్రి పరిశీలనలో భాగంగా ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటు చేయాలని పలువురు ఎంఎల్ఎ దృష్టికి తీసుకురావడంతో ఆయన స్పందించారు. హైవే పక్కనే ఆసుపత్రి ఉండడంతో ఇక్కడ ట్రామా కేర్ సెంటర్ అత్యవసరమని, ప్రతిపాదనలు, అవసరమైన పరికరాలు, సిబ్బంది నివేదికను అందచేయాలని, వెంటనే ప్రభుత్వంతో మాట్లాడి మంజూరుకు కృషి చేస్తానని వివరించారు. చిన్నారుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ద్వారా ఏర్పాటు చేసిన బాల భవిత కేంద్రాలు నెల్లూరు జిల్లాలో రెండు మాత్రమే ఉన్నాయని, వాటిలో ఒకటి ఆత్మకూరు జిల్లా వైద్యశాలలో ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. చిన్నారులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూసుకోవాలని వైద్యులను కోరారు. అనంతరం కంటి వైద్య విభాగాన్ని పరిశీలించి రోగులను క్షేమ సమాచారాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆసుపత్రి విజిటర్స్ రిజిష్టర్‌లో సంతకం చేశారు. ఆయనవెంట డిసిహెచ్ ఎస్.రమేష్‌నాథ్, డిఎంహెచ్ఒ పెంచలయ్యల, ఆత్మకూరు జిల్లా వైద్యశాల వైద్యులు, సిబ్బంది, వైసిపి నాయకులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

బోయలను ఎస్‌టిల్లో చేర్చడం దారుణం

ప్రజాశక్తి-కావలి



నిరసన చేపడుతున్న నాయకులు

బోయ, వాల్మీకిలను ఎస్.టి. జాబితాలో చేర్చాలనే ప్రభుత్వ నిర్ణయాన్ని నిరసిస్తూ యానాది సంక్షేమ సంఘం జిల్లా చైర్మన్ రాపూరు క్రిష్ణయ్య ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేపట్టారు. కావలిలోని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహం వద్ద శుక్రవారం నిరసన ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం ఎస్‌టి జాబితాలో బోయ కులస్తులను చేర్చినందుకు నిరసన తెలియజేస్తున్నామని తెలిపారు. రాష్ట్రప్రభుత్వం ఎస్‌టి జాబితాలో బోయలను చేర్చినందుకు అసెంబ్లీ తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపించడం వల్ల స్థానికంగా 40 లక్షల మంది గిరిజన నోళ్ళు కొట్టారని పేర్కొన్నారు. ఎస్‌టిలలో ఉన్న గిరిజనలు విద్యాపరంగా ఉద్యోగ పరంగా అవకాశాలు లేక ఉన్న రోజుల్లో పుండు మీద కారం చల్లినట్లు వచ్చే ఒకటి రెండు ఉద్యోగాలు రానివ్వకుండా చేయడం వల్ల అసల్కైన గిరిజనులు అనేక ఆర్థిక ఇబ్బందులు పడిపోతున్నారని తెలియజేశారు. ఈ క్రమంలో రాయలసీమలో ఉన్న బోయ కులస్తులను మళ్ళీ ఎస్‌టి జాబితాలో చేర్చినందు వల్ల వచ్చే ఉద్యోగాలు కూడా పోయే అవకాశాలు ఉన్నాయని తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్ తీరప్రాంత జిల్లాలో యానాదుల పరిస్థితి చాలా దుర్భరంగా ఉందన్నారు. ఇప్పటికీ చాప పిల్లలు పట్టుకొని జీవిస్తూ దుర్భర జీవితాన్ని గడుపుతున్న యానాదుల జీవితాల్లో బోయ కులస్తులను చేర్చడం వల్ల అనేక కష్టాలు ఏర్పడతాయని తెలియజేశారు. ఇప్పటికే ఎస్‌సి, ఎస్‌టి రెండు కార్పొరేషన్లు మూత వేసి ఆర్థికంగా అణగదొక్కిన రిజర్వేషన్లు కూడా ఇలా కులాలను చేర్చడం వల్ల జీవితాలు ఇబ్బందుల పాలవుతాయన్నారు. కార్యక్రమంలో జిల్లా యానాది సంక్షేమ సంఘం చైర్మన్ రాపూరు క్రిష్ణయ్య, రాపూరు రాధమ్మ, కొత్తపల్లి యానాది కాలనీ కమిటీ నాయకులు గుడ్లూరు అంజయ్య, మెగిలి కల్లయ్య, కత్తి ఆదీశేషయ్య, ఎస్.మల్లి,గిరిజన సంఘ నాయకులు పాల్గొన్నారు.

ప్రయాణికుల వసతిగృహమేనా..?

షాపింగ్ కాంప్లెక్స్‌గా ఉందనే అనుమానంపై కమిషనర్‌కు సిపిఎం వినతి

ప్రజాశక్తి-ఆత్మకూర్ అర్బన్



వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు

ఆత్మకూరు మున్సిపల్ బస్టాండ్‌లో నిర్మాణం చేపడుతున్న బస్టాండ్ ప్రయాణికులకు వసతి గృహమా.. లేదా షాపింగ్ కాంప్లెక్స్ అనేది అనుమానంగా ఉందని సిపిఎం నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం ఆత్మకూరు మున్సిపాలిటీ పాత మున్సిపల్ బస్టాండ్ ఆవరణంలో నిర్మిస్తున్న ప్రయాణికుల వసతిగృహ నిర్మాణానికి సంబంధించి సమాచార చట్టం ప్రకారం సమాచారం కోసం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ ఆ నిర్మాణానికి నిధులు ఎక్కడి నుంచి తెస్తున్నారని, ప్రయాణికుల వసతిగృహం గతంలో మున్సిపాలిటీ దానిని పగలగొట్టారని తెలిపారు. నూతన కట్టడానికి నిర్మాణం చేపట్టి పూర్తి కావస్తుందని, అది ప్రయాణికుల వసతి గృహమా.. షాపింగ్ కాంప్లెక్స్ అనేది అర్థం కావడం లేదని, బస్టాండ్ నిర్మాణానికి నిధులు ఎక్కడినుండి వస్తున్నాయి, అవి రాష్ట్ర ప్రభుత్వం నిధులా లేక కేంద్ర ప్రభుత్వ నిధులా ఎలా జరుగుతున్నాయని ప్రశ్నించారు. అక్కడ డ్రెయినేజీ పనులు జరుగుతున్నాయని, అవి ఏ నిధుల నుండి ఖర్చు పెడుతున్నారని తెలియ జేయాలన్నారు. అక్కడ ఏ నిర్మాణం జరుగుతుందో అనే అంశం మున్సిపల్ కౌన్సిల్లో చర్చ జరిగిందా.. లేదా.. చర్చలో మెజార్టీ కౌన్సిల్ తీర్మానం చేసే ఆమోదించారా.. లేదా.. అనేది ప్రజలకు మున్సిపల్ కౌన్సిల్ సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. నిర్మాణం రోజులకు నెలలుకొద్ది జరుగుతూ ఉండే లోపల చుట్టుపక్కల ఉండే వ్యాపారస్తులు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కరువుకాలంగా ఉండే ఈ ఆత్మకూరులో ఇది ఒక్క కొత్త దరువుగా వచ్చి పడిందన్నారు. మున్సిపాలిటీ వల్లే పనుల వేగవంతం చేసి అక్కడ వ్యాపారాలు సజావుగా చేసే విధంగా మున్సిపల్ అధికారులు బాధ్యత తీసుకోవాలన్నారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు గంటా లక్ష్మీపతి, సిపిఎం పట్టణ కార్యదర్శి డేవిడ్ రాజు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ సంధాని, డివైఎఫ్ఐ నాయకులు నందా శ్రీను, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి : ఎంపిపి

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్



మాట్లాడుతున్న ఎంపిపి కేతా వేణుగోపాల్‌రెడ్డి

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన గడపగడపకు మన ప్రభుత్వం గ్రామాభివృద్ధికి ఎంతగానో దోహద పడుతుందని ఎంపిపి కేత వేణుగోపాల్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని నువ్వూరుపాడు గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం రివ్యూ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యల దురదగతన పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఎంపిడిఒ శ్రీనివాసులు మాట్లాడుతూ గ్రామంలో 129 సమస్యలు ఉన్నాయని వాటిలో 68 సమస్యల పరిష్కారం చేశామని, మిగిలినవి త్వరలోనే పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో తహశీల్దార్ లక్ష్మీనరసింహ, అగ్రికల్చర్ ఎఒ కిషోర్ బాబు, సర్పంచి కటారి దొరసానమ్మ, వైసిపి నాయకులు గడ్డం శ్రీనివాసులు, విఆర్ఒ మాల్యాద్రి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తహశీల్దారు

పౌర హక్కులపై అవగాహన

ప్రజాశక్తి-మర్రిపాడు

మండలంలోని తిమ్మాయిపాలెంలో పౌర హక్కులపై తహశీల్దార్ హేమంత్ కుమార్ శుక్రవారం ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగం పౌరులందరికీ సమాన హక్కులు కల్పించిందన్నారు. అలాగే అందరూ స్వేచ్ఛ, సమానత్వం, సోదరిభావం కలిగి ఉండాలని, కులవివక్ష, అంటరానితనం ఉండకూడదని సోదరి భావంతో కలిసిమెలిసి ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సురేంద్ర, కంపసముద్రం హాస్టల్ సంక్షేమ అధికారి అంకయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

ముగిసిన అవగాహన కార్యక్రమం

ప్రజాశక్తి-మర్రిపాడు



మండల పరిధిలోని బాట బీట్ చాబోలు ఎస్‌సి కాలనీలో జిల్లా అటవీ శాఖాధికారుల ఆదేశాల మేరకు వన్యప్రాణులు, ఎర్ర చందనం సంరక్షణపై అవగాహన కార్యక్రమం శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా కృష్ణాపురం సెక్షన్ డిప్యూటీ రేంజ్ అధికారి రాజశేఖర్‌గౌడ్ మాట్లాడుతూ జిల్లాలో ఎర్రచందనం ఎక్కువగా నల్లమల అటవీ ప్రాంతంలో ఉందని దానిని కాపాడవలసిన బాధ్యత ప్రజలందరిపై ఉందన్నారు. గొర్రెలు, పశువులు అడవులలోకి మేతకు వెళ్లినప్పుడు, కాపారులపై అడవి జంతువులు దాడి చేసిన మాకు సమాచారం ఇచ్చినట్లయితే ఆర్థికంగా ఆదుకుంటామన్నారు. వేసవి కాలంలో అడవులలో ఎక్కువగా మంటలు చెలరేగుతుంటాయని వాటిని నివారించి అడవులను కాపాడాలని ఆయన కోరారు. అడవులలో నిప్పు పడడం వల్ల జంతువులు నశించిపోతున్నాయని వాటి జీవ వైవిధ్యం కూడా కష్టమవుతుందని వాటిని కాపాడుకోవా లంటే అడవుల్లో నిప్పు పడకుండా చూడాలన్నారు. అడవుల అభివృద్ధికి, జీవన వైవిధ్యానికి ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతుందన్నారు. అడవుల అభివృద్ధి కోసం సమీప గ్రామస్తులు అడవుల సంరక్షణ కోసం పాటుపడుతూ అటవీ శాఖ అధికారులకు సహకరించాలని కోరారు. అటవీశాఖ అధికారులు మండల వైద్యాధికారి డాక్టర్ గోపీనాథ్ ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపు నిర్వహించారు. రోగులను పరీక్షించి మందులను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు సాయికృష్ణ, ఎం.తిరుపతి, స్ట్రైకింగ్ ఫోర్స్ సిబ్బంది కె.నరసింహా రావు, ఆర్.వెంకట సుబ్బయ్య, బేస్ క్యాంపు సిబ్బంది గోపాల్, రోశయ్య, శ్రీను, కృష్ణయ్య, ఆరోగ్యశాఖ మండల విస్తరణ అధికారి ఎన్.కొండారెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్ ఖాజామొహిద్దీన్, సైదా, అంకిరెడ్డి, ఎఎన్ఎం, గ్రామస్తులు పాల్గొన్నారు.

రామసుబ్బారెడ్డి 11వ వర్ధంతి

ప్రజాశక్తి-కావలి



మాట్లాడుతున్న నాయకులు

తపాలా ఉద్యోగుల ఆశాజ్యోతి, జిడిఎస్‌ల ఆశాకిరణం, నెల్లూరు డివిజన్ గురు పితామహుడు, సుదీర్ఘ కాలం యూనియన్‌కి సేవచేసిన పోరాటయోధుడు రామసుబ్బారెడ్డి వర్ధంతి సందర్భంగా శుక్రవారం ప్రధాన తపాలా కార్యాలయంలో ఎన్ఎఫ్ పిఇ యూనియన్ నాయకులు, సభ్యులు, తపాలా ఉద్యోగులు పెద్దఎత్తున ఆయన చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు. ఆయన జ్ఞాపకార్థం కార్యాలయం ప్రాంగణంలో ఎన్ఎఫ్ పిఇ యూనియన్ లోగోను ఆవిష్కరించి శిలాఫలకం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా నాయకులు రెహనా బేగం, పెంచలయ్య, కృష్ణ మోహన్ మాట్లాడుతూ తపాలా ఉద్యోగుల సమస్యల సాధనలో ప్రజల మనిషిగా రామసుబ్బారెడ్డి చిరస్మరణీయ పేరు పొందరన్నారు. ఆయన ఆశయాలను కొనసాగించాలని ఎన్ఎఫ్‌పిఇ యూనియన్ నాయకులు ఎ.వి.కృష్ణయ్య, సిహెచ్.వెంకయ్య పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎం.జి.కె.సాయి, కె.బాలకృష్ణ, జి.రంగబాబు, వై.రవీంద్ర, పెన్షనర్ నాయకులు షేక్.కాలేషా, డివైఎఫ్ఐ నాయకులు లక్ష్మీ నరసింహులు, తపాలా ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

బాధితుడికి మాలేపాటి పరామర్శ

ప్రజాశక్తి-కావలి

పట్టణ టిడిపి నాయకులు ఇగుటూరు మాల్యాద్రి తమ్ముడు కొత్తపల్లి వాస్తవ్యులు ఇగుటూరు మహేష్ బ్రెయిన్ స్ట్రోక్ కారణంగా నెల్లూరులోని అపోలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న కావలి నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి మాలేపాటి సుబ్బానాయుడు శుక్రవారం ఆసుపత్రికి వెళ్లి, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఇగుటూరు దత్తాత్రే య, మహేంద్ర, వెంకటేశ్వర్లు, సతీష్, సుల్తాన్, వరప్రసాద్, భరత్, ప్రసాద్, వెంకట్రావు, మదన్ తదితరులున్నారు.

ఘనిబాషాకు సత్కారం

ప్రజాశక్తి-కావలి : హ్యాపీ సేవాసంస్థ చేస్తున్న మంచి కార్యక్రమాలకు గానూ శుక్రవారం విశ్వంభర ఛారిటబుల్ ట్రస్ట్ వారు హ్యాపీ సేవాసంస్థ అధ్యక్షుడు సయ్యద్. ఘనీభాషాను నెల్లూరు ప్రకాష్, నగర్లో ఘనంగా దుశాలువాతో సన్మానించినారు. కార్యక్రమంలో విశ్వంభర చారిటబుల్ అధినేత సువర్ణకుమారి, జయప్రతాప్ రెడ్డి, ఎమ్‌డి.నజీర్ పాల్గొన్నారు.

టెండరు ప్రకటన
గ్రామ పంచాయతి కార్యాలయం - వేగూరు

తేది: 31-03-2023

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, కోవూరు మండలం, వేగూరు గ్రామ పంచాయితీ **2023-2024 సంIIనకు** చెందిన ఈ క్రింది షెడ్యూల్‌లో తెలిపిన కార్మికులను సరఫరా చేయుటకు సీల్డు టెండర్లు కోరుబడుచున్నవి. టెండర్లులో పాల్గొనదలచిన వారు **తేది 03-04-2023,** సోమవారం **ఉదయం 10.30 గంటల** నుండి **మధ్యాహ్నం 3.00 గంటల** వరకు పంచాయితీ కార్యదర్శి వారిచే గానీ లేక వారి అనుమతి పొందిన వారిచే గాని టెండర్లు స్వీకరించబడును. సదరు టెండర్లు అదే రోజు **మధ్యాహ్నం 3.30 గంటలకు** హాజరు కాబడిన టెండరు దారుల సమక్షములో టెండర్లు తెరవబడును. ఈ దిగువ తెలిపిన షెడ్యూల్లో చూపిన దరావత్తు చెల్లించి,టెండర్లు దాఖలు చేయవలెను. ధరావత్తు చెల్లించని టెండర్లు తిరస్కరించబడును. ఇతర వివరములు కొరకు కార్యాలయము పనిచేయువేళలలో సంప్రదించగలరు.

వ.నెం.	టెండరు వివరములు	ధరావత్తు
	(తేది. 01.04.2023 నుండి 31.03.2024 వరకు పని చేయుటకు)	
1.	స్వీపర్స్ (పారిశుధ్యపని)-5	1000-00
2.	పంప్ ఆపరేటర్లు-5	
3.	ఎలక్ట్రీషియన్-1	

సం/- **బి.విజయ శ్రీ,** పంచాయితీ కార్యదర్శి
వేగూరు గ్రామ పంచాయతి, కోవూరు మండలం, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా.

కావలి బార్ అసోసియేషన్ ఎన్నిక

ప్రజాశక్తి - కావలి



ఎన్నికైన బార్ సభ్యులను సత్కరిస్తున్న పోట్లూరు శ్రీనివాసులు

స్థానిక కోర్టు భవనాలలోని కావలి బార్ అసోసియేషన్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన ఎన్నికల్లో ప్రెసిడెంట్‌గా ఐ.వి.రామిరెడ్డి, కార్యదర్శిగా ప్రకాష్, వైస్‌ప్రెసిడెంట్‌గా రిషికుమార్, జాయింట్ సెక్రటరీగా ప్రసాద్, కోశాధికారిగా శేషుప్రసాద్, లైబ్రేరియన్‌గా అభిషేక్, లేడీ రిప్రెజెంటేటివ్‌గా కోటా రాధలు ఎన్నికయ్యారు. ఎన్నికయిన అసోసియేషన్ బాధ్యులను కావలి సీనియర్ న్యాయవాది, మాజీ ఎ.జి.పి.పోట్లూరు శ్రీనివాసులు పూలమాలలేసి ఘనంగా సత్కరించారు. కొత్తగా ఎన్నికైన ఆఫీస్ బేరర్లు అసోసియేషన్‌కు కష్టపడి సేవలు చేసి, మంచిపేరు తీసుకురావాలని శుభాకాంక్షలు తెలిపారు.

ఆశ్రమంలో విజిలెన్స్ తనిఖీలు

ప్రజాశక్తి-అల్లూరు : మండలంలోని నార్త్ ఆములూరు పంచాయతీ గొల్ల పాలెం గ్రామంలోని చైల్డ్ ఆశ్రమంలో శుక్రవారం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్ మెంట్ అధికారులు విస్తృత తనిఖీలు చేపట్టారు. ఆశ్రమానికి సంబంధించిన ఆయా రికార్డులను పరిశీలించి విద్యార్థుల వసతులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆశ్రమ నిర్వాహకులు రామచంద్ర శరత్ మాట్లాడుతూ సాధారణ తనిఖీల్లో భాగంగా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు వచ్చి వెళ్లారని తెలియజేశారు.

15 మందికి ఓటు వేయొచ్చు.. : కలెక్టర్

ప్రజాశక్తి-నెల్లూరు : ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా కమిటీ ఎన్నికలు నిర్వహించనున్న తరుణంలో 2వ తేదీన అంటే ఆదివారం ఓటింగ్‌లో పాల్గొన్న ప్రతి సభ్యుడు విధిగా 15 మందికి మాత్రమే ఓటు వేయాలని కలెక్టర్ కెవిఎన్ చక్రధర్‌బాబు ప్రకటనలో తెలిపారు. ఈ ఎన్నికలకు సంబంధించి కొంత మంది సభ్యులు హైకోర్టులో మార్చి 31న రిట్ పిటిషన్ నెంబర్ 8130 దాఖలు చేశారన్నారు. ఈ రిట్‌పిటీషన్‌ను అనుసరించి గౌరవ హై కోర్ట్ వారి ఉత్తర్వుల ప్రకారం, నెల్లూరు రెడ్‌క్రాస్ మేనేజింగ్ కమిటిలో18 మందిని కాకుండా 15 మందికి పరిమితం చేసి ఆ విధంగా ఎన్నికలు నిర్వహించాలని ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు జరిగే ఎన్నికల్లో ప్రతి సభ్యుడు 15మందికి మాత్రమే ఓటువేయాల్సి ఉంటుందన్నారు.

In The Court of The IIIrd Addl. Junior Civil Judge : Nellore
O.S.No. 710 / 2022

Sri Gunapati @ Gunupati Jayanth @ Jayanth Reddy - Plaintiff
Vs
1. Lagadapati Hari Prasad and 5 others - Defendants

Notice to 5th Defendant

Yeluri Santhoshamma, W/o **Israel,** Kanuparthipadu Village, Nellore Mandal, SPSR Nellore District.

పై నెంబరు కేసులో వాది మీమీద పై వారి కోర్టులో దావా దాఖలు చేసియున్నారు. సదరు దావాలో మీకు నోటీసు నిమిత్తం **తేది: 27-4-2023** న వాయిదా ఉన్నది. ఆరోజు **ఉదయం 10.30 గంటలకు** మీరు స్వయంగా గాని వకీలు ద్వారా గాని హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనవలసినది. లేనియెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.

జి. రాజగోపాల్ రెడ్డి
పి.వై.ఎన్.శర్మ
వాది తరపు న్యాయవాదులు, నెల్లూరు.

బహిరంగ ప్రకటన

నా కక్షీ దారుడు అయిన శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, (పాత ప్రకాశం జిల్లా), ఉలవపాడు మండలం, ఉలవపాడు గ్రామ కాపురస్తుడు **బాపనపల్లి శ్రీమన్నారాయణ, వెంకట సుజాత** గార్ల దత్త **కుమారుడు బాపనపల్లి శబరి సాయినాథ్** ఇచ్చిన సంజాయిషీ మేరకు **బాపనపల్లి రాజాశెట్టి** గారి కుమారుడు **శ్రీమన్నారాయణ,** సదరు **శ్రీమన్నారాయణ** గారి భార్య **వెంకట సుజాత** అనువారలు నా కక్షీ దారుని 2002 వ సంవత్సరము వారి కుల, మత సాంప్రదాయముల ప్రకారము దత్తుచేసుకొనియున్నారు. అప్పటి నుండి నా కక్షీ దారుని ఆలనా, పాలన విద్య బుద్ధులు వగైరాలు నా కక్షీ దారుని దత్తు తల్లి దండ్రులైన సదరు **బాపనపల్లి శ్రీమన్నారాయణ, వెంకట సుజాత** గార్లు జరుపుతున్నారు. కాలమాన పరిస్థితుల దృష్ట్యా మా కుల పెద్దలు మరియు మా శ్రేయోభిలాషులు ఇచ్చిన సలహా సూచనల మేరకు నా కక్షీదారుని కన్న తల్లిదండ్రులైన **బాపనపల్లి శ్రీమన్నారయణ, వెంకట సుజాత** గార్లు రిజిష్టరు దత్త స్వీకార పత్రమును **తేది:25.10.2014** న శ్రీ సింగరాయకొండ సబ్ రిజిస్ట్రారు గారి ఆఫీసులో **డాక్యుమెంటు నెం.D.IV/14/2014** న పొందియున్నారు. వారి ఇరువురి మరణానంతరం, దరిమిలా మా దత్తు తండ్రి అన్నగారైన **బాపనపల్లి రాజాశెట్టి** గారి కుమారుడు **సత్యనారాయణ** గారి భార్య అయిన **లక్ష్మీకుమారి,** కుమార్తె **గాయత్రి** మరియు ఆమె కుమారుడు నాగరాజు అనువారలు మా దత్తు తల్లిగారైన **వెంకట సుజాత** గారి అన్నదమ్ములు లాలూచీ పడి నాకు మా దత్తు తల్లిదండ్రుల మరణానంతరము హిందూ వారసత్వ రీత్యా నాకు సంక్రమించి పూర్తి హక్కు భుక్తములు గల యావదాస్తులను పైన తెలిపిన **బాపనపల్లి లక్ష్మీకుమారి** మరియు ఆమె అన్నదమ్ములు ప్రజలను మభ్యపెట్టి నాకు పూర్తి హక్కు భుక్తములు గల మా దత్తు తల్లిదండ్రుల మరణానంతరం లభించిన ఆస్తులను పరాధీనము అన్యాక్రాంతము చేయుటకు ప్రయత్నించుచున్నారు.నాకు నా దత్తు తల్లిదండ్రుల మరణానంతరం సంక్రమించిన యావదాస్తులలో పై వారికి ఎలాంటి హక్కు లేదు.

కావున మా దత్తు తల్లిదండ్రుల ద్వారా నాకు సంక్రమించిన ఆస్తులను ఎవరైనను పై **లక్ష్మీ కుమారి** వగైరాల వద్ద కొనుగోలు చేసిన అట్టి క్రయ విక్రయములు చెల్లవనియు మరియు అలాంటి క్రయ విక్రయములు మా కక్షీదారుడైన **బాపనపల్లి శ్రీమన్నారాయణ, వెంకట సుజాత** గార్ల దత్త కుమారుడు **బాపనపల్లి శబరి సాయినాథ్**ను బద్ధపరచవనియు మరియు నా కక్షీదారుడు చట్టపరంగా తీసుకొని అన్ని రకములైన సివిల్ క్రిమినల్ చర్యలకు బాధ్యులగుదురని ఇందు మూలంగా తెలియజేయడమైనది.

బి.వి.శేషయ్య, బి.కాం., బి.ఎల్.,
న్యాయవాది, కందుకూరు
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా.